క్లుప్తంగా

మహాలక్ష్మి అమ్మవారికి తులాభారం



అమ్మవారి ఆలయంలో బెల్లాన్ని తులాభారంగా ఇస్తున్న భక్తులు

రాయవరం: స్థానిక మహాలక్ష్మి తల్లి ఆలయంలో అమ్మవారికి గ్రామానికి చెందిన మల్లిడి ఏవీవీ సత్యనారాయణరెడ్డి, దేవికారాణి దంపతులు మొక్కు తీర్చుకున్నారు. దేవికారాణి, తమ చిన్నారి శ్రీకర్ విహాన్‌రెడ్డిల బరువుకు సమానంగా బెల్లాన్ని తులాభారం ఇచ్చారు. 101 కిలోల బెల్లాన్ని అమ్మవారికి సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు పులగం శ్రీనివాసరెడ్డి, సత్తి వెంకటసుబ్బారెడ్డి, సత్తి సత్తిరెడ్డి, నల్లమిల్లి రామారెడ్డి, సత్సంగం సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యాన శాఖాధికారిగా కోటేశ్వరరావు



గంటా కోటేశ్వరరావు

కపిలేశ్వరపురం: ఉద్యాన శాఖ కొత్తపేట సబ్ డివిజన్ అధికారిగా గంటా కోటేశ్వరరావు నియమితులయ్యారు. ఇప్పటి వరకూ పనిచేసిన హెచ్‌ఓ అనూష రామచంద్రపురానికి బదిలీ అయ్యారు. కపిలేశ్వరపురం మండలంలో ఉద్యాన శాఖ కార్యకలాపాలను కోటేశ్వరరావు పర్యవేక్షించనున్నారు. ఆయన హార్టికల్చర్‌లో పీహెచ్‌డీ చేశారు. 2021 నోటిఫికేషన్ ద్వారా తొలి పోస్టింగ్‌లో కొత్తపేట సబ్ డివిజన్‌లో విధుల్లో చేరినట్టు ఆయన తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో విద్య



మండపేటలో తల్లులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సింహాచలం

మండపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట పాటలతో విద్య అందిస్తున్నారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సత్యవేణి, వి.సింహాచలం అన్నారు. స్థానికంగా పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం జన భాగీదారీ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు కలిగే ప్రయోజనాలను వారి తల్లులకు వివరించారు. మూడు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపడం ద్వారా వారి శారీరక, మానసిక వికాసానికి బాటలు వేయాలని సూచించారు. అనంతరం తల్లులతో ర్యాలీలు నిర్వహించారు.

పశువుల పాక దగ్ధం



కాలిపోయిన పశువుల పాక

మండపేట: స్థానిక వీరభద్రపురంలో శుక్రవారం పశువుల పాక దగ్ధం కాగా ఒక పాడి గేదె మృతి చెందింది. మరో గేదెకు తీవ్ర గాయాలయ్యాయి. వీరభద్రపురానికి చెందిన వి.శివరావు స్థానికంగా పశువుల మకాం ఏర్పాటు చేసుకుని రెండు పాడి గేదెలను పెంచుతున్నారు. పశువుల మకాంపై ఉన్న విద్యుత్ తీగలు గాలికి ఒకదానికొకటి తగిలి పాకకు నిప్పంటుకుంది. ఈ ఘటనలో పశువుల పాకతో పాటు పక్కనే ఉన్న గడ్డివామి అగ్నికి ఆహుతైంది. ఒక పాడిపశువు మృతిచెందగా మరొకటి తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు మండపేట ఫైర్ స్టేషన్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.రెండు లక్షల ఆస్తినష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు.

లబ్ధిదారులకు ఇక్కట్లు

మండపేట: స్థానిక టిడ్కో ప్లాట్ల వద్ద పలు సమస్యలు లబ్ధిదారులను పట్టిపీడిస్తున్నాయని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శుక్రవారం టిడ్కో ప్లాట్లు వద్దకు వచ్చిన ఆయన స్థానికులతో మాట్లాడారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ పాల్గొన్నారు.

భర్త, అత్తలపై కేసు

అంబాజీపేట: అదనపు కట్నం తీసుకురావాలని తన భర్త, అత్తల వేధింపులు తాళలేక వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ జేజీఎస్ వరప్రసాద్ తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. 9 ఏళ్ల క్రితం అద్దంకివారిలంకకు చెందిన దాకే నాగేశ్వరరావుతో నాగలక్ష్మికి వివాహం జరిగింది. కొన్ని నెలలుగా నాగలక్ష్మిని అదనపు కట్నం తీసుకురావాలని ఆమె భర్త నాగేశ్వరరావు, అత్త సూర్యకాంతం చిత్రహింసలకు గురి చేస్తున్నారన్నారు. భర్త, అత్త వేధింపులు తాళ్ల లేక మే నెలలో నాగలక్ష్మి పుట్టిల్లు పుల్లేటికుర్రుకు వచ్చేసిందన్నారు. తన భర్త నాగేశ్వరరావు ఈ నెల 15వ తేదీన పుల్లేటికుర్రు వచ్చి ఆమె తల్లిని కాళ్లపై కొట్టి గాయపరిచాదన్నారు. నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

సచివాలయాలు.. సేవా నిలయాలు

- గ్రామాల్లోనే అందుబాటులో అన్ని సేవలు
- గ్రామ స్వరాజ్యానికి ప్రేరణ



ద్రాక్షారామ గ్రామ సచివాలయం

రామచంద్రపురం రూరల్: పల్లె సీమలే రాష్ట్ర ప్రగతికి పట్టుకొమ్మలు అన్న నానుడి నిజం చేస్తూ రాష్ట్ర సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సృష్టించి ఏర్పాటు చేసిన గ్రామ/వార్డు సచివాలయాలు గ్రామ ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలను చేర్చి రికార్డు సృష్టించాయి. దేశం యావత్తూ మన రాష్ట్రం వైపు చూసేలా సచివాలయ వ్యవస్థను రూపొందించి ముఖ్యమంత్రి నాణ్యమైన, అవినీతికి తావులేని సత్వర సేవలను రాష్ట్ర ప్రజలకు అందిస్తున్నారు. గత ప్రభుత్వాల్లో ప్రజలకు ఏ అవసరం వచ్చినా మండల కేంద్రాలకు వ్యయ ప్రయాసలకోర్చి వెళ్లవలసి వచ్చేది. అంతే కాకుండా ఎంతో కొంత ముట్టజెప్పితే కానీ పనులు జరగని పరిస్థితులు ఉండేవి. అటువంటి బాధలకు ఫుల్‌స్టాప్ పెడుతూ సీఎం జగన్ ప్రతి 2 వేల జనాభాకు ఒక సచివాలయ వ్యవస్థను, దీనికి తోడుగా ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలను నేరుగా ప్రజల ఇంటికే అందించే వలంటీర్ వ్యవస్థను ప్రారంభించారు. వీటికి తోడు రైతులకు సొంతూరిలోనే సేవలు అందేలా రైతు భరోసా కేంద్రాలు, సొంత ఊరిలోనే వైద్యం అందేలా విలేజ్ క్లినిక్‌లు, ఒక్కటేమిటి మొత్తం ప్రభుత్వ పాలనను గ్రామాలే కేంద్రంగా నడిచేలా గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చారు. సచివాలయాల్లో 10 శాఖలకు సంబంధించి 10 మంది ఉద్యోగులు ప్రజలకు ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారు.

అందిస్తున్న సేవలు

సచివాలయాల్లో ప్రభుత్వానికి సంబంధించి ఫించన్ పంపిణీ, అందరికీ ఇళ్లు, చేదోడు, చేయూత, మ్యుటేషన్, ఇళ్లు, భూముల సర్వే, జనన, మరణ ధ్రువీకరణ, పీఎం కిసాన్, రేషన్ కార్డు, ఆదాయ, కులధ్రువీకరణ తదితర 545 రకాల సేవలను ప్రజలకు అందిస్తున్నారు.

గ్రామ పంచాయతీలు : 25
సచివాలయాలు : 21
సచివాలయ ఉద్యోగులు : 181
వలంటీర్లు : 471
టీడీపీ హయాంలో వ్యవసాయ శాఖ సిబ్బంది : 5
వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వ్యవసాయ సిబ్బంది : 22
టీడీపీ హయాంలో పంచాయతీ ఉద్యోగులు : 3
వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పంచాయతీ ఉద్యోగులు : 11
మండలంలో అన్ని రకాల పథకాల లబ్ధిదారుల సంఖ్య : 1,61,502
లబ్ధిదారులకు అన్ని రకాల పథకాల ద్వారా పొందిన లబ్ధి : రూ.376.12 కోట్లు
మండలంలో వివిధ రకాల పింఛన్లు పొందుతున్న వారి సంఖ్య : 10,284
ఒక నెలకు మండలంలో పింఛనుదారులకు లబ్ధి : రూ.2.75 కోట్లు

అన్ని విధాలుగా ఆదుకుంటున్న ప్రభుత్వం



సీఎం జగన్ ప్రభుత్వం పేదలను అన్ని విధాలుగా ఆదుకుంటోంది. నేను ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాను. వైఎస్ రాజశేఖరరెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉండగా అందించిన ఫీజు రీయింబర్సుమెంట్‌తో పిల్లలిద్దరూ బాగా చదువుకుని స్థిరపడ్డారు. నాకు వృద్ధాప్య పింఛన్ ఒకటో తేదీనే తెల్లవారకుండా ఇంటికే తెచ్చి అందిస్తున్నారు. సొంత ఇళ్లు లేదన్న బెంగ తీర్చుతూ ముఖ్యమంత్రి ఇళ్ల స్థలం ఇచ్చారు. ముఖ్యమంత్రికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– దొమ్మేటి త్రిమూర్తులు, ద్రాక్షారామ

నాయకుడు అవసరం లేని సమాజాన్ని సృష్టించారు..



'భరత్ అనే నేను' అనే సినిమా చివరిలో నాయకుడు అవసరం లేని సమాజాన్ని సృష్టించడమే నిజమైన నాయకుడి లక్షణం అనే టైటిల్‌తో సినిమా ముగుస్తుంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దానిని నిజం చేసి చూపించారు. ఈ రోజు ఏ పథకం కావాల్సినా, ఏ అవసరం వచ్చినా రాజకీయ నాయకులు రికమెండేషన్లు అవసరం లేకుండా నిజమైన అర్హులకు ఇంటికే వెళ్లి మరీ పథకాలను అందిస్తున్నాం. ఇటువంటి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధిగా ఉన్నందుకు గర్వపడుతున్నాను.

– సరాల రాజ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ, రామచంద్రపురం మండలం

గ్రామ స్వపరిపాలనను నిజం చేశారు



అన్ని శాఖల అధికారులు గ్రామాల్లోనే ఉండి సేవలందించేలా సచివాలయాలను ఏర్పాటు చేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వపరిపాలనను నిజం చేసి చూపించారు. గతంలో నేను పంచాయతీ సర్పంచ్‌గా పని చేసినప్పుడు పంచాయతీ కార్యదర్శి నాలుగైదు పంచాయతీలకు ఒక్కరే పనిచేసేవారు. దీనితో పాలన కుంటుపడేది. కానీ ఇప్పుడు నా భార్య సర్పంచ్‌గా ఉంది. గ్రామ సచివాలయంలో 10 మందికి పైగా ఉద్యోగులతో ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ నిత్యం కళకళలాడుతోంది.

– టేకుమూడి సత్యనారాయణ, మాజీ సర్పంచ్, వెలంపాలెం

పగలు సెగ.. రాత్రి భగభగ



జనం లేక వెలవెలబోతున్న మండపేట కలువపువ్వు సెంటర్



మండపేటలో నిర్మానుష్యంగా కేపీ రోడ్డు

మండపేట: సూరీడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు.. నిప్పుల కుంపటిలా మారుతున్నాడు.. జనాన్ని అల్లాడిస్తున్నాడు.. రోజురోజుకూ అధికమవుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలను ఇబ్బంది పెడుతున్నాడు. శుక్రవారం మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో 44 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. వారం రోజులుగా 42 డిగ్రీల పైమాటే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. భానుడి ప్రతాపంతో ప్రజలు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. బయటకు రావాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. దీంతో మండపేట తదితర ప్రాంతాల్లో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. మధ్యాహ్నం 11 గంటలకే దాదాపు షాపులన్నీ మూతపడుతున్నాయి. నిత్యం జనంతో రద్దీగా ఉండే మండపేట, రామచంద్రపురం పట్టణాల్లోని ప్రధాన కూడళ్లు మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల సమయం వరకూ జనసంచారం లేక వెలవెలబోతున్నాయి. ఇళ్లలోని నీటి ట్యాంకుల్లో నీరు వేడెక్కిపోతోంది. చీకటిపడి రాత్రి 10 గంటలైనా వేడి గాలులు తగ్గడం లేదు. మరికొద్ది రోజులు ఎండల తీవ్రత ఉంటుందని అధికారులు చెబుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం



రాయవరంలో పథకాలపై కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

రాయవరం: ప్రజా సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. శుక్రవారం రాయవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఉప సర్పంచ్ బొడ్డు శ్రీనివాస్, కేవీఆర్ ఆసుపత్రి అధినేత డాక్టర్ తేతలి నవీన్‌రెడ్డి తదితరులతో కలసి ఆయన గ్రామంలో ఇంటింటా పర్యటించి పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి ప్రజలు ఆదరాభిమానాలు చూరగొన్నారన్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, ఇలా సమాజంలో అన్నివర్గాల ప్రజలకు మేలు చేకూర్చిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీ మాత్రమేనన్నారు. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చడమే కాకుండా పేద విద్యార్థులు చదువుతో మాత్రమే ఉన్నత స్థానాలకు చేరుకోగలరని నమ్మిన వ్యక్తి సీఎం జగన్ అన్నారు. రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్, వైఎస్సార్ సీపీ నాయకులు తాడి రామచంద్రారెడ్డి, టి.గంగాధర్‌రెడ్డి, మంతెన అచ్యుతరామరాజు, పడాల కమలారెడ్డి, వెలగల సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలతో మెరుగైన సేవలు



రామచంద్రపురంలో పథకాల గురించి వివరిస్తున్న మంత్రి వేణు

మంత్రి వేణుగోపాలకృష్ణ

రామచంద్రపురం: తన పాదయాత్ర ద్వారా పేదవారి కష్టాలను తెలుసుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదరిక నిర్మూలనకు నవరత్న పథకాలను తీసుకువచ్చారని, ప్రతి కుటుంబానికి వాటిని చేరవేసేందుకు సచివాలయ వ్యవస్థను నెలకొల్పారని రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని 12వ సచివాలయం పరిధిలోని 28వ వార్డులో శుక్రవారం జరిగిన గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆయా కుటుంబాలు పొందిన లబ్ధి వివరాలు, పథకాలను వివరించారు. స్థానిక ప్రజలు వివరించిన సమస్యలను సావధానంగా విని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్, అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం దిశగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతాయని సాంకేతిక సమస్యలతో పథకాలు అందుకోలేని వారికి కూడా ఈ ప్రభుత్వం పథకాలను అందజేస్తుందన్నారు. సంక్షేమ పథకాల అమలు దేశంలో ఎక్కడా లేని విధంగా లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా జమ చేయటం జరుగుతుందని వివరించారు. రైతు భరోసా, ఆరోగ్యశ్రీ, నాడు నేడు ద్వారా పాఠశాలల ఆధునీకరణ, అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యాదీవెన, గోరుముద్ద లాంటి పథకాలు ప్రభుత్వం అమలు చేస్తుందని మంత్రి వివరించారు. ఇళ్లు లేని వారికి గృహనిర్మాణాలు, మహిళల కోసం ఆసరా, చేయూత లాంటి సంక్షేమ పథకాలు రాష్ట్ర వ్యాప్తంగా అమలు జరుగుతుందన్నారు. సమాజంలో పేదవారు సుస్థిర జీవనం గడుపుతున్నారని మంత్రి తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానిక ప్రజలు గ్రామ పెద్దలు వార్డు సభ్యులు తమకు ఉన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. డ్రైనేజీల సమస్యలతో పాటుగా రోడ్లు సమస్యలను మంత్రికి వివరించగా తగు చర్యలు తీసుకోవాలని కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డిని ఆదేశించారు. మున్సిపాలిటీ వాటర్‌లైన్‌లోని వాటర్‌ను పరిశీలించి క్లోరిన్ శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. పట్టణ వాసులకు తాగునీటి సమస్య లేకుండా స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నామని తెలిపారు. స్థానిక కౌన్సిలర్ కుడిపూడి లలిత, కౌన్సిలర్లు వాడ్రేవు సాయిప్రసాద్, సచివాలయ సిబ్బంది, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



బండారు విజయ, ఆమె తల్లిదండ్రులను సత్కరిస్తున్న అధ్యాపకులు, పెద్దలు

కాజులూరు: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతి స్థితిని అధిరోహించాలని కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ అన్నారు. కళాశాల విద్యార్థిని బండారు విజయ ఈ ఏడాది ఇంటర్మీడియెట్‌లో 937/1000 మార్కులు సాధించి మండల ప్రథమ స్థానంలో నిలిచారు. సీఎం జగన్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆణిముత్యాలు పథకానికి ఎంపికై ఇటీవల రామచంద్రపురంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి చెల్లుబోయిన వేణు చేతుల మీదుగా రూ.15 వేలు నగదు పారితోషకం, ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ మేరకు శుక్రవారం కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి అవార్డు సాధించిన బండారు విజయ, ఆమె తల్లిదండ్రులను అధ్యాపకులు, గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో వసతులు మెరుగుపరచటమే కాకుండా విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులిచ్చి ప్రోత్సహించటం ఎంతో అభినందించదగిన విషయమన్నారు. కళాశాల సిబ్బంది, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు



పసలపూడిలో విద్యార్థులకు జేవీకే కిట్లు అందజేస్తున్న పారిశ్రామికవేత్తలు, ప్రజాప్రతినిధులు



కేదారిలంకలో విద్యార్థులకు విద్యా కానుకలు అందజేస్తున్న సర్పంచ్ తదితరులు

రాయవరం: విద్యా రంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని పారిశ్రామికవేత్తలు చింతా వెంకటరెడ్డి (బాబులు), చైతన్య రాజబాబు, చింతా సుబ్బారెడ్డి అన్నారు. పసలపూడి మండల పరిషత్ మెయిన్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రగతి రామారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బాబులు, రాజబాబు మాట్లాడుతూ దేశం మొత్తం ఏపీ వైపు చూసేలా విద్యా సంస్కరణలు చేశారన్నారు. పేదలు విద్యతోనే పెద్దవాళ్లవుతారన్న సిద్ధాంతాన్ని ప్రభుత్వం బలంగా నమ్ముతుందన్నారు. సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ చింతా రామ్మోహన్‌రెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ నల్లమిల్లి వెంకటరెడ్డి (చినకాపు), జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం నూలు ఆదినారాయణ, పాఠశాల హెచ్ఎం కేవీ రమణ మాట్లాడుతూ జగనన్న విద్యా కానుకలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న పారిశ్రామికవేత్తలు చింతా సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి (బాబులు), చైతన్య రాజబాబు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రగతి రామారెడ్డి, బదిలీపై వెళ్లిన హెచ్ఎం కె.మాణిక్యాంబ, ఉపాధ్యాయుడు ఎస్.వెంకటరెడ్డిలను గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు సత్కరించారు. సర్పంచ్ కడల పద్మావతి, ఎంపీటీసీ కర్రి విజేత, పీఎంసీ చైర్మన్ తాడి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మండలంలోని నేలటూరు, కేదారిలంక గ్రామాల్లో శుక్రవారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలను ప్రజాప్రతినిధులు అందజేశారు. ఆయా గ్రామాల సర్పంచులు కుక్కల వీరన్న, వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రుద్రాక్షుల వీరగౌరీకుమారి, యర్రంశెట్టి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీల అధ్యక్షులు శనక్కాయల దొరబాబు, పోలిశెట్టి గణేష్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

అంబాజీపేట: ఈ నెల 23 నుంచి వచ్చే నెల 23వ తేదీ వరకూ నెల రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుసంధానంగా 'సురక్ష' కార్యక్రమాన్ని చేపడుతున్నామని తహసీల్దార్ టి.మంగతాయారు చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అంబాజీపేట మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ శుక్రవారం నిర్వహించారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ గ్రామ వలంటీర్, సచివాలయం సిబ్బంది, గృహసారథులు, ప్రజా ప్రతినిధులు వెళ్లి సమస్యలు ఆరా తీయాలన్నారు. గతంలో దరఖాస్తులను తిరస్కరిస్తే అందుకు కారణాలను 'సురక్ష'లో భాగంగా వారికి స్వయంగా చెప్పాలని ఆదేశించారు. ఏ ఒక్కరికీ సచివాలయ పరిధిలో సమస్యలు లేకుండా అధికారులు చూడాలన్నారు. మండల స్థాయిలో ఎంపీడీవో, డిప్యూటీ తహసీల్దార్‌తో 'సురక్ష' కమిటీని నియమించాలని కమిటీ ఎప్పుడు పర్యటిస్తుందో ముందే సమాచారం ఇవ్వాలన్నారు. ఒక ఊళ్లో ఒక రోజంతా గడుపుతూ ప్రజలకు అవసరమైన పత్రాలను అప్పటికప్పుడే అందిస్తూ వచ్చిన అభ్యర్థనలన్నీ మ్యాపింగ్ చేయాలని నిర్దేశించారు. ఈ అవకాశాన్ని మండలంలో ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

19న జాబ్ మేళా

మలికిపురం: మండలంలోని లక్కవరం మంగెన గురయ్య కళాశాల ప్రాంగణంలో ఈ నెల 19వ తేదీన జాబ్ మేళా జరుగుతుందని కరస్పాండెంట్ మంగెన వెంకట సత్య ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ప్రముఖ సంస్థలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని 25 సంవత్సరాల లోపు అభ్యర్థులు తమ విద్యార్హత పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని అన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి



విద్యార్థులను సత్కరిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం: ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. స్థానిక చింతపల్లి సూరన్న నగర్ మున్సిపల్ హైస్కూల్‌లో పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆయన శుక్రవారం ప్రోత్సాహకాలు అందజేసి, సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి పేద విద్యార్థికీ కార్పొరేట్ స్కూల్ మాదిరిగా ఉన్నత విద్యను అందించాలనే తపనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు – నేడు ద్వారా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని అన్నారు. జగనన్న అమ్మ ఒడి, విద్యాదీవెన, విద్యా కానుక వంటి సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదుగుతారని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.మాధవ, కౌన్సిలర్ కుడిపూడి లలితా గణేష్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా లక్షతులసి పూజ



ఆలయం వద్ద పూజలు చేస్తున్న పండితులు

కె.గంగవరం: మండలంలోని పామర్రులోని పట్టాభి రామాలయం వద్ద శుక్రవారం లక్ష తులసి దళాల పూజను వేద పండితులు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన చిట్టూరి మల్లీశ్వర ప్రసాద్ కుటుంబీకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజల్లో వేద పండితులు ఉదయం నుంచి పలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అనంతరం లక్ష తులసి దళాలతో అభిషేకాలు చేశారు. ఈ పూజల్లో ప్రసాద్ కుటుంబీకులతో పాటు స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రతి కౌలురైతుకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

కాజులూరు: భూ యజమానితో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి రైతుకు రెవెన్యూ అధికారులు కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని ఒంటితాడిలో రాజబాబు మాట్లాడుతూ మండలంలో సుమారు ఎనిమిదివేల మంది కౌలు రైతులు ఉండగా అధికారులు నాలుగువేల మందికి మించి కార్డులు ఇవ్వటం లేదన్నారు. రైతులందరూ తప్పనిసరిగా సీసీఆర్‌సీ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కౌలురైతు కార్డు పొందటం ద్వారా బ్యాంకుల నుంచి రుణాలు పొందటంతో పాటు వ్యవసాయశాఖ నుంచి విత్తనాలు, సూక్ష్మపోషకాలు, ఎరువులు, యంత్రాలు సబ్సిడీపై పొందవచ్చన్నారు.

మట్టి ట్రాక్టర్ సీజ్

అంబాజీపేట: ఎటువంటి అనుమతులు లేకుండా పసుపల్లిలో మట్టిని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను తహసీల్దార్ టి.మంగతాయారు శుక్రవారం రాత్రి సీజ్ చేశారు. అక్రమంగా మట్టి తరలిస్తున్నారని సమాచారం రావడంతో మట్టి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఆమె వెంట ఆర్ఐ ఇబ్రహీం ఉన్నారు.

ఆధ్యాత్మిక కోలాహలం.. శ్రీనివాస కోలాటం



అంబాజీపేటలో కోలాట ప్రదర్శన చేస్తున్న మహిళలు

అంబాజీపేట: సనాతన సంప్రదాయాల్లో భాగమైన కోలాట నృత్యాన్ని వాడవాడలా వ్యాప్తి చేయడమే టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు లక్ష్యమని శ్రీహరే శ్రీనివాస కోలాట భజన మండలి గురువు బుడిగిన ఈశ్వర్ అన్నారు. అంబాజీపేట వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం రాత్రి తిరుమల తిరుపతి దేవస్థాన దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గజ్జెపూజ, అనంతరం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత మంతా ఆధ్యాత్మిక కోలాహలంతో అలరాడింది. గురువు ఈశ్వర్ మాట్లాడుతూ గత రెండు నెలలుగా అంబాజీపేటలోని సుమారు 60 మంది మహిళలు, చిన్నారులకు కోలాట శిక్షణ ఇచ్చామని, శుక్రవారం గజ్జెల పూజ నిర్వహించామన్నారు. అమలాపురం రూరల్ మండలం, నల్లచెరువులో వేంచేసిన వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో తొలి ప్రదర్శన ఇస్తారన్నారు. ఇంతవరకు తాము 3 వేల ప్రదర్శనలు ఇచ్చామన్నారు. ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించడం వల్ల చిన్నతనం నుంచే వారిలో ఆధ్యాత్మిక కోలాహలం మొదలవుతుందన్నారు. కార్యక్రమంలో తాడిపర్తి వీరాస్వామి, గణేష్, దుర్గారావు పాల్గొన్నారు.